# రాజద్రోహి

శ్రీ శ్రీనివాసశిరోమణి

౧౯౧౬ సంవత్సరము ఏప్రిల్ నెల ౨౨ వ తేది శనివారమునాడు వచ్చిన(లండన్) "టైమ్సు" పత్రికలో యీక్రిందిశీర్షికతో ఒకవర్తమానము కనుపించినది. "పడవలో యుద్ధసామగ్రి. ఐరిషు సముద్రతీరాన పట్టుకొనడమయినది." కర్‌హాన్ స్టాౢండులో "అర్డుఫర్ట్" పోలీసువాండ్లు నిన్న తెల్లవారుఝామున నాల్గుగంటలకు ఒకపడవలో చాలామందుగుండుసామగ్రి పట్టుకొన్నట్టు "ట్రాలి"కి రాత్రి వర్తమానము వచ్చినది.

ఆప్రాంతములలో — ఏజాతివాడో తెలియని ఒకణ్ణిపట్టుకొని ఖైదిలో అట్టిపెట్టినారు. ఆ పడవ ఏదేశమునుంచి వచ్చినదో, ఆ ఆయుధసామగ్రి ఎవరికోసరము వచ్చినదో ప్రస్తుతము తెలియలేదు."

ఈవార్త పత్రికలో కనుపించినప్పుడు యింగ్లీషుదేశములో ఎవళ్లూ అట్టేశ్రద్ధతో యోజించలేదు. కొద్దిరోజులయినతరువాత "సర్ రోజరు కేసుమెంటు" అనే ఆయన ఆమందుగుండుసామగ్రిని ఐరిషుదేశానికి దిగుమతిచేసినాడని తెలిసేసరికి యావత్తు బ్రిటీషుప్రభుత్వము నిర్ఘాంతపోయినది. సర్ రోజర్ కేసుమెంటు అటువంటిపని చేస్తాడని ఎవళ్లూ కలలోనైనా అనుకోలేదు. అప్పటికి కొద్దిరోజుల కిందటివరకూ బ్రిటీషుసామ్రాజ్యములో ఉన్నతపదవులలో ఉండి సామ్రాజ్యముయొక్క మన్ననలను పొందినాడు. ఏదో ఉద్యోగధర్మము చక్కగా నిర్వర్తించి ఊరక కీర్తిగణించినవాడుకాడు. దక్షిణ అమెరికా మధ్య ఆఫ్రికా దేశాలలో బ్రిటీషుకన్సలేటు (రాజప్రతినిధి) గా ఉండి ఆయన బ్రిటీషుసామ్రాజ్యానికి చేసిన సేవను — ఒక్క బ్రిటీష్‌దేశమేకాదు, యావత్తు నాగరకప్రపంచమూ వెయ్యినోళ్లతో పొగిడింది. "కాంగో" (మధ్యాఫ్రికా) లో ఉద్యోగముచేస్తున్నరోజులలో కేవలమూ ఆయన ప్రయోజకత్వమువల్ల, ఆయన ఔదార్యమువల్ల ఆదేశస్థులకు జరుగుతున్న అపకారాలను లోకానికి వెల్లడిచేసి అటు అనాగరకజనులకూ, ఇటు నాగరకప్రపంచానికీ తలలో నాలిక అయినాడు. బ్రిటీషుసామ్రాజ్య ధురంధరులలో ముఖ్యుడుగా పేరు గణించినాడు. సామ్రాజ్యానికి ఆయనచేసిన ఉపకారానికీ, ఆయన తీసుకొనివచ్చిన ఖ్యాతికీ మెచ్చుకొని బ్రిటీషుప్రభుత్వము ఆయనకు సి. యం. జి. అనే బిరుదాన్ని యిచ్చింది. నలభై యెనిమిదో సంవత్సరము వచ్చేవరకు అనేక అనాగరకపు దేశాలలో కొలువుచేసి ఓపికపోయి పింఛన్ పుచ్చుకొని స్వదేశమయిన ఐరిషుదేశములో కాలము వెళ్లబుచ్చడానికి వచ్చినాడు.

౧౯౧౨ సంవత్సరములో పింఛన్ పుచ్చుకొని కేసుమెంటు యింటికిచేరేనాటికి ఆయనదేహదార్ఢ్యము సంపూర్ణముగా పోయినది. ఒంటరివాడు. పెండ్లి అయినా చేసుకోలేదు. విశేషము ధనార్జన అయినా చేయలేదు. ప్రభుత్వమువారుయిచ్చే పింఛన్ అయినా సామాన్యమయినది. ఏదోఉద్యోగముచేస్తూ సంపాదించిన కీర్తితప్ప మరొకటిలేదు. పదిమందిలో కలసిమెలసి తిరిగి ఏవో వ్యవహారాలునెత్తిన వేసుకొని చక్కబెట్టి పదిడబ్బులు సంపాదించే తెలివితేటలయినా ఆయనకు లేవు. దేశాలుకాని దేశాలలో జీవితమంతా ఉద్యోగములో గడిపినందువల్ల ఆరోగ్యము సంపూర్ణముగా పోయినది. ఏకాంతముగా, ఏకాకిగా స్వదేశములో కాలక్షేపముచేస్తున్నాడు. అటువంటివాడి భవిష్యత్తు ఎంత అంధకారముగా ఉంటుందో ఎవరు చెప్పగలరు! అయితే ఆయన అదొకరకమయిన మనిషి. కుట్రవాండ్లలాగా వెర్రిఊహాగానాలు చేయడము ఆయన కలవాటు. ఊహాగానము చేయడమే ఆయనస్వభావము. ముందువెనకలు ఆలోచించకుండా యుక్తాయుక్తములు గుర్తించకుండా యుద్ధానికి సన్నద్ధుడయ్యే యోధుడిలాంటి స్వభావమాయనది. అయితే పదిమందితో తన అభిప్రాయాలు నచ్చచెప్పి వాండ్లను వెంటవేసుకొని తన

పనులు నెరవేర్చుకొనే చాకచక్యము లేదు. ఇటువంటి వాడు ఐరీషుదేశములో నివసించడానికి వచ్చినాడు.

ఐర్లాండుదేశములో ఆరోజులలో స్వాతంత్ర్యోద్యమము గందరగోళముగా సాగుతున్నది. ఐరీషువాండ్లకున్నంత దేశాభిమానము భూభాగములో ఏదేశము వాండ్లకూ లేదు. అదొకపిచ్చవంటిది. ఆపిచ్చదేశాభిమానానికి అంతూపంతూ లేదు. స్వాతంత్ర్యముకోసరము కుర్రవాండ్లు ఏవేవో పిచ్చిపిచ్చిపనులన్నీ చేయడానికి తలపెడుతున్న రోజులవి. అయితే ఐరీషువాండ్లలో బుద్ధిమంతులయినవాండ్లు తొందరపడి పిచ్చికల్లోలాలు తీసుకొనిరాగూడదని హితబోధ చేసేవారుకూడా ఉన్నారు. అయితే కుర్రసజ్జుతొందరకూ, హడావిడికీ అడ్డు ఏమిటి? దూరదృష్టి తక్కువ. రాజకీయాలలో ఎంతో దూరదృష్టికలవాండ్లుకూడా రాజ్యముచేతులో బోల్తాకొడుతూ ఉంటారు. కేసుమెంటు వెర్రిఉత్సాహము కలవాడు. అతనిదిన్ని ఐరిషుదేశస్థులాగానే వెర్రిదేశాభిమానము. పైగా ఊహాగానము చేసేవాండ్లలో అగ్రసరుడు. అందువల్ల కుర్రకారుతో దేశాభిమానములో పడిపోయినాడు. ఇక ఊహాగానాలు స్వాతంత్ర్యముకోసరము చేయడము మొదలుపెట్టినాడు. కేసుమెంటు స్వార్థరహితుడు. తన స్వార్థరహితమయిన బుద్ధివల్లనే బ్రిటీషుసామ్రాజ్యపు మెప్పులను పొందినాడు. సహజ స్వార్థరహిత బుద్ధితోటే హడావిడికుర్రకారుతో కలసిపోయినాడు. అయితే ఉపన్యాసాలిచ్చి జనసమూహాన్ని ఉర్రూతలూగించే శక్తిలేదు. సమస్తాన్ని దేశముకోసరము త్యజించి త్యాగమూర్తి అనే ఖ్యాతి సంపాదించడానికి- ఆయనకున్నదంతా ఆయన భోజనానికి బొటాబొటీగా సరిపొయ్యే పింఛనే. ఇక పదిమంది యువకులను చేరదీసి వాండ్ల చిత్తవృత్తులను కనిపెట్టి ఉత్సాహపరచి పనులు చేయించే నేర్పరితనము అయినా లేదు. కాని వెర్రిమంత్రాంగము- తిక్కమంత్రాంగముచేసే తెలివితేటలుమట్టుకు కావలసినవాటికన్న ఎక్కువగా ఉన్నవి.

ఇటువంటివాణ్ణి ఐరీషుయువకులు - దేశభక్తులంతా నాయకుణ్ణిగా పెట్టుకోదలచుకొన్నారు. నాయకత్వము వహించడానికిమాత్రము ఆయన ఒప్పుకోలేదు. నాయకత్వము వహించడానికి తనకున్న యోగ్యతలు స్వయముగా గుర్తుఎరిగి కాబోలు, కేసుమెంటు అంగీకరించలేదు. పాపము, కేసుమెంటుకు దేశసేవ ఎట్లా చేయవలెనో తెలిసిందికాదు. స్వాతంత్ర్యముకోసరము తానేమిచేయువలెనో అసలు ఊహించనేలేకపోయినాడు. ఆమాయకులు, అనాగరకులు అయిన ఆఫ్రికాదేశము వాండ్లు తెల్లవాండ్ల చేతులలోపడి వాండ్లు అనుభవిస్తున్న ఘోరబాధలుచూసి ఓర్చలేక, తాను ఉన్నతోద్యోగములో ఉన్నందున ఆఘోరకృత్యాలను ప్రభుత్వానికి తెలియజేసి ప్రభుత్వసహాయముతో నివారించడానికిన్నీ, బలవంతమయిన ప్రభుత్వానికి దాస్యముచేస్తున్న దేశానికి మోక్షము యిప్పించడానికిన్నీ ఏమీసంబంధము లేదు. అక్కడ బలవంతమయిన ప్రభుత్వబలము ఉంటుంది. ఇక్కడ ఏరెండుతలలూ కలియని కుర్రమూక ఉంటుంది. ఈ కుర్రమూకతో స్వాతంత్ర్యము కోసరము పాటుపడి ప్రభుత్వముతో పొట్లాట సాగించవలెను. అసమానమయిన ప్రజ్ఞఉంటేనే కాని సాధ్యముకాదు. అనుచరులను నీళ్లలో మునగమనడానికి కానీ, నిప్పులో దూకమనడానికి కానీ, ముడుచుకొని కూర్చోమనడానికి కానీ ఎంతో ప్రజ్ఞ ఉన్నవాడికి కూడా అప్పుడప్పుడు అసాధ్యమే అవుతూ ఉంటుంది. అక్కడ ప్రభుత్వములో యీ విధముగా ఉండదు. తమప్రతినిధి ఏమి చెపుతున్నాడో తెలుసుకొని ప్రపంచములోకల్లా బుద్ధిమంతులని పేరుపొందిన మంత్రులంతా జాగ్రత్తగా విషయాన్ని పరిశీలించి అవసరమయినపనులన్నీ నెరవేరుస్తారు. న్యాయము, ధర్మము అనేది ప్రభుత్వము ఆచరణలో పెడుతుంది. ఇక్కడనో అర్థబలము, అంగబలము, బుద్ధిబలము, సమస్తబలమూ కల ప్రభుత్వము ప్రబలవిరోధి. జనసామాన్యము రాజకీయవిషయాలు చప్పున అవగాహనచేసుకొనలేదు. సమస్తమూ ఉత్సాహముతో గంతులువేసే యువకుల మీద ఆధారపడిఉంటుంది. అటువంటి యువకులమీద ఆధారపడి రాజకీయవ్యవహారములో జొరబడడముకంటె బుద్ధిమాంద్యము యింకొకటి ఉంటుందా! అయితే

ఆ ఉత్సాహములో, ఆ ఉద్రేకములో, ఆ ఆవేశములో సర్ రోజరుకేసుమెంటుకు యుక్తాయుక్త విచక్షణా జ్ఞానము పోయినది.

ఐర్లాండు స్వాతంత్ర్యోద్యమములో రెండురకాల వాండ్లున్నారు. ఒకళ్లు మితవాదులు. రెండోవాండ్లు అతివాదులు. కేసుమెంటు అతివాది. "కార్సన్" అనే న్యాయవాది. ఐరిషువాడు. తరవాత న్యాయమూర్తి కూడా అయినాడు. ఐరిషురాజకీయాలలో మితవాది. కేసుమెంటు రాజకీయజ్ఞానమంతా "కార్సన్" వల్ల నేర్చుకొన్నదే. కార్సను అంటే ఆయన ఉత్సాహముతో పొంగిపొయ్యేవాడు. ఒకప్పుడు అతివాదులసభ ఒకటి జరిగింది. పాపము కేసుమెంటు ఉత్సాహాతిశయములో సభాసదుల చిత్తవృత్తులను గుర్తించకుండా కార్సన్‌కు వందనము లర్పించినాడు. మితవాదికి ఆసభలో వందనాలు చెప్పినందుకు సభాసదులకు పట్టరాని కోపమువచ్చినది. బల్లలూ, కుర్చీలు తీసుకొని కేసుమెంటును కొట్టడానికి సిద్ధము అయినారు. కేసుమెంటు రాజకీయజ్ఞానమూ, లోకజ్ఞానమూ యిటువంటిది. పసిపిల్లవాడికి ఉండే ఉత్సాహమూ, ఉద్రేకమూ తప్ప మరొకటి ఆయనకు లేదు.

కేసుమెంటుకు రోజురోజుకు దేశాభిమానము ఎక్కువయిపోవడము మొదలుపెట్టినది. యిరోపా మహాసంగ్రామానికి కొద్దిరోజులకుపూర్వము "ఐరిషురెవ్యూ" అనే పత్రికలో "ఐర్లాండు - జర్మని, రాబోతున్న యుద్ధము" అనే శీర్షికతో ఒకవ్యాసము వ్రాసినాడు. "ఐర్లాండుద్వీపములో ఉన్నవాండ్లంతా యూరోపియనులు. వాండ్లు యింగ్లీషువాండ్లుకారు. అందువల్ల అనేకశతాబ్దాలనుంచి ఐర్లాండువాండ్లు యింగ్లీషు ప్రభుత్వములోనుంచి తొలగిపోవలెనని మొరపెట్టుకొంటున్నారు." ఇంతేకాదు. ఇంకా చాలా విపరీతవిషయాలు ఆయనవ్రాసినాడు. ఐర్లాండుదేశాన్ని జర్మని ప్రభుత్వము పరిపాలించినా మంచిదేకాని ఇంగ్లీషు ప్రభుత్వము పాలించడముమాత్రము పనికిరాదన్నాడు. ఆయన అభిప్రాయము పాలకులు జర్మనీవాండ్లు అయితే ఐర్లాండుకు స్వాతంత్ర్యము వెంటనే యిస్తారనికాబోలు!

౧౯౧౪ సంవత్సరము వచ్చేసరికి కేస్మెంటుకు యీ పిచ్చి ఊహ ఎక్కువయిపోయింది. ఇందుకోసరమనే ౧౯౧౪ వ సంవత్సరము వేసంగిల్లో అమెరికాదేశము వెళ్లినాడు. అక్కడ-అమెరికాల్లో-ఉన్న జర్మనురాయబారితో ఈవిషయాన్ని అంతా ముచ్చటించినాడు. జర్మనీవాండ్లు ఐరిషువాండ్లతో సఖ్యము కుదుర్చుకోవచ్చునని సలహాయిచ్చినాడు. ఇంగ్లీషు ప్రభుత్వములో నుంచి ఐర్లాండు తొలగిపోవడానికి మరొకదేశమువాండ్లతోచేరి వాండ్లసహాయమువల్లనేతప్ప మరొకవిధముగా సాధ్యముకాదని ఆయన విశ్వాసము.

ఇక ఒకచెంప యుద్ధము ఆరంభమయినది. ఇంగ్లీషువారు 'మిత్రమండలి'లో ప్రవేశించినారు. ఇటు ఐర్లాండుదేశములో వాండ్లలో వాండ్లకు అభిప్రాయభేదములు వచ్చినవి. చివరకు రాజభక్తే విజృంభించినది. అనేకమంది యుద్ధములో భటులుగా తయారుఅయినారు. కేసుమెంటు ఆశలన్నీ నష్టాల్లో కలిసిపోయినవి. ఆయనమాదిరిగా ఊహాగానముచేస్తున్నవాళ్ల సంఖ్య చాలాస్వల్పము. బ్రిటీషుసామ్రాజ్య గౌరవమే ఐరిషుగౌరవమని అసంఖ్యాకులు నిర్ణయించినారు. కేసుమెంటు రాజకీయవిషయాలలో పూర్తిగా ఏకాకి అయిపోయినాడు. ఆయనకు అనుచరులనేవారే లేకపోయినారు. ఆయన త్రికరణశుద్ధిగా విశ్వసించిన ధర్మాలను ఆయనే ఒంటరిగానే ఆచరణలోకి తీసుకొని రావడానికి నిశ్చయించుకొన్నాడు. మరొకరి ప్రోత్సాహముకానీ, ప్రోద్బలముకానీ ఆయనకులేదు. ప్రపంచమంతా వ్యతిరేకమయినా ఆయనది విడేస్వభావము కాదు. ఒకవేళ ఐరిషుదేశస్థులంతా ఆలోచించుకొని తమకు స్వాతంత్ర్యము అక్కరలేదని నిశ్చయించుకొన్నా కేసుమెంటుమాత్రము ఐరిషుదేశస్వాతంత్ర్యానికే ప్రాణాలు ధారపోస్తాడు.

ఈయుక్తాయుక్తములు తెలియని దేశాభిమానముతో జర్మనీదేశము పోవడానికి అమెరికానుంచి ఒక 'ప్యాసుపోర్టు' సంపాదించినాడు. ఒకనొకరును నార్వే దేశపువాణ్ణి వెంటబెట్టుకొని యుద్ధము మహాభయంకరముగా జరుగుతున్నరోజులలో జర్మనీకి బయలుదేరి

నాడు. ఆసమయములో జర్మనికి సరాసరిపోవడము సాధ్యముకాదు. అందుకోసరము చుట్టు తిరిగిపోవడానికోసరము ముందు నార్వేదేశానికి వెళ్లదలచుకొన్నాడు. "ఆస్కార్" అనే నార్వేదేశపు ఓడలో ప్రయాణము సాగించినాడు.

అనుకొన్నంత సుఖవుగా ప్రయాణము సాధ్యపడలేదు. మార్గమధ్యములో బ్రిటీషుఓడ ఒకటి ఆనార్వే ఓడను అటకాయించి అందులో ప్రయాణముచేస్తున్న వాండ్ల నందరిని సోదాచూసినారు. ఆప్రయాణీకులలో ఆర్గురు జర్మనీవాండ్లను పట్టుకొని ఖైదీలుగా తీసుకొన్నారు. అయితే కేసుమెంటుదగ్గిర అమెరికాదేశపు "ప్యాసుపోర్టు" ఉన్నది. ఆయననౌకరు నార్వేదేశపువాడు. వాండ్లుభయులూ నార్వేదేశమే వెళ్లుతున్నారు. వాండ్లు ఆశంకించినప్పటికిన్ని యీయిద్దరిని యుద్ధనిబంధనలప్రకారము ఖైదిచేయడానికి అవకాశము లేకపోయినది. కాని వీండ్లమీద అనుమానమయితేమాత్రము కలిగింది. అనుమానము కలిగినా ప్రయోజనము లేకపోయినది. కేసుమెంటూ ఆయననౌకరూ సురక్షితముగా నార్వేదేశము చేరినారు.

నార్వేదేశములోఉన్న బ్రిటీషులెగేషన్ (రాయబారి) వారు కేసుమెంటును గురించి అనుమానపడినారు. వెంటవెంట యింగ్లీషుగూఢచారులు ఆయనజాడలు కనిపెట్టసాగినారు. ఆయననౌకరును పట్టుకొని అనేక రకములయిన ప్రశ్నలువేసినారు. కాని ఆయన ఏవ్యవహారముమీద వచ్చినాడో వాండ్లకు అంతుచిక్కలేదు. కేసుమెంటు రహస్యాన్ని బయటపెడితే ఎంతో బహుమానము వస్తుందని ఆనౌకరుతో వాండ్లు చెప్పినారు. కేసుమెంటు జర్మన్ లెగేషన్‌వారిని పట్టుకొని మెల్లిగా జర్మనుదేశము వెళ్లవలెననే ప్రయత్నములో ఉన్నాడు. ఆయన్ను ఎట్లాగైనా పట్టుకొని ముందుగా ఇంగ్లీషు లెగేషన్‌వారికి ఒప్పగించవలెననే ప్రయత్నములో యింగ్లీషుగూఢచారులు ఉన్నారు. ఈ సంగతి ఆయన తెలుసుకొన్నాడు. వాయువేగమనోవేగములతో నౌకరును జర్మన్ లెగేషన్‌వారివద్దకు పంపించినాడు. ఉదయము ఏడుగంటలకు జర్మన్ లెగేషన్‌వారిని కేసుమెంటు కలుసుకొనడానికి అనుజ్ఞ అయినది. ఉదయమే తెల్లవారగనే ఒకకారులో బయలుదేరినాడు. వెంట యింగ్లీషుగూఢచారులు వస్తున్నారని తెలుసుకొన్నాడు. కారు ఒకసందుదగ్గిర మలుపుతిరుగుతూఉన్న సమయములో కారులోనుంచి మెల్లిగా బయటకుదిగి ఆకాస్తసేపూ దాగుకొని ఎవరికండ్లాబడకుండా జర్మన్ లెగేషన్‌వారి దర్శనముచేసినాడు. ఆయన ఉద్యమాన్ని జర్మన్ విదేశాంగమంత్రికి ఫోనులో చెప్పి ఆయన అనుజ్ఞ అయినతరువాత కేసుమెంటుకు కబురు పంపేటట్టు జర్మన్ లెగేషన్‌వాండ్లు చెప్పినారు. తిరిగీ బసకు చేరినాడు. అత్యాత్రముతో ఎప్పుడు వర్తమానము వస్తుందోనని కనిపెట్టుకొని కూర్చున్నాడు.

బ్రిటిషు లేగేషన్ గూఢచారులు అత్యంత జాగ్రత్తతో ఆచోకీ తీస్తున్నారు. ఆయననౌకరును నిర్బంధించినారు. రహస్యము చెపితే విశేషముగా బహుమానము చేస్తామన్నారు. ఆ నౌకరు తాత్కాలికముగా వాండ్ల చేతులలోనుంచి తప్పించుకొని వచ్చి యజమానితో యావద్విషయాలూ చెప్పినాడు. కేసుమెంటు వెంటనే ఒకకొత్తఎత్తు వేసినాడు. నౌకరువెళ్లి బ్రిటిషు లెగేషన్‌వారితో చెప్పినాడు. తనను కూడా ఆయనతోపాటు జర్మనీదేశము వెళ్లనిచ్చేట్లయితే ఆయనదగ్గిర నౌకరుగానే ఉంటూ గూఢచారిగా ప్రవర్తిస్తానని చెప్పినాడు. మార్గాంతరములేక వాండ్లు అందుకు ఒప్పుకొన్నారు.

చీకటిపడింది. జర్మన్ విదేశాంగమంత్రిదగ్గరనుంచి వర్తమానము ఏమీ రాలేదు. ఆ ఆదుర్దాలో తెల్లవార్లూ ఆయనకు నిద్రపట్టలేదు. చిట్టచివరకు జర్మనీ దేశానికి కేసుమెంటును పంపమని ఆజ్ఞ అయినట్లు జర్మన్ లెగేషన్‌వాండ్లు కబురు పంపినారు. ఆయనా, ఆయన నౌకరూ కలసి జర్మనీదేశము ఆ ఉదయమే బయలుదేరి వెళ్లిపోయినారు. కేసుమెంటు జర్మనీలో ప్రవేశించిన తర్వాత అక్కడివాండ్లంతా ఆయన్నుచూసి ఆశ్చర్యపోయినారు. కేసుమెంటుకు జర్మన్ భాషలో ఓనమాలయినా రావు. ఆయనగొడవ వాండ్లకుకానీ వాండ్లగొడవ ఆయనకు కానీ చప్పున తెలియడానికి వీలులేకపోయింది అటువంటి సమయాలలో భాష

రాకపోయినంత మాత్రాన ఆగిపోతుందా? అందులో నిన్న మొన్నటివరకున్నూ బ్రిటీషు సామ్రాజ్య ధురంధరులలో ప్రాముఖ్యతపొంది, వృద్ధాప్యమువల్ల కృశించిపోయి, ఆరోగ్యమంతా చెడిపోయి కాటికి కాళ్లు చాచుకొన్నవాడు ఐరిషుయోధులను తయారుచేస్తాను, జర్మనీవారు సహాయముచేసేట్లయితే బ్రిటీషువాండ్ల చూరులో నిప్పుపెడతానని వచ్చినవాణ్ణి ఆ సమయములో తోసిపుచ్చుతారా? అయితే వాండ్లకు అనేక సందేహాలు కలిగినవి. ఆయన్ను వాండ్లు పూర్తిగానమ్మడానికి కొంతకాలము పట్టినది. మొట్టమొదట కొంతమంది - ఆయన జర్మనీ వర్తమానాలను కనుక్కొని పోవడానికి యీమిషతో వచ్చినాడని అనుకొన్నా ఇంకాకొంతమంది బుద్ధిమంతులు - ఆయనతలపెట్టినది సాధ్యము అయ్యేదికాదు. కేవలము వృద్ధాప్యమువల్ల మతిచెడిపోయి యీవిధముగా వచ్చినాడని అన్నారు. ఐరిషుదేశములో స్వాతంత్ర్యముకోసరము జరుపుతున్న గందరగోళమంతా పైత్యజ్వరములాంటిదని వాండ్లకు తెలుసును. ఆజ్వరము సంధిలోకి దిగుతుందా దిగదా అనే వారిఅనుమానము. సంధిలోకి దిగేట్లయితే చాలును. అయితే ఆసన్నిపాతమంతా అప్పటికి కేసుమెంటు ఒకడికేపుట్టింది. జర్మనీవాండ్లు అటువంటి సందేహములో ఉన్నారనితెలిసే "నాకు యీమాత్రమూ సంశయములేదు. వందలతరబడి, వేలతరబడి నాకు అనుచరులు ఏర్పడుతారు. జర్మనీలో ఖైదిలోఉన్న ఐరిషువాండ్లే ముందుగా నాకు అనుచరులు అవుతారు అవకాశమిచ్చి చూడవలసినది." అని జర్మను విదేశాంగమంత్రికి ఉత్తరము వ్రాసినాడు.

చిట్టచివరకు జర్మన్ ప్రభుత్వము కేసుమెంటుకు అవసరమయిన సహాయాన్నిఅంతా చేయడానికి నిశ్చయించుకొన్నది. నిజముగా ఆయనప్రయత్నాలన్నీ సఫలమయ్యేట్లయితే జర్మనీ విజయము చూపుమేర దూరములోఉంటుంది. ఒకవేళ కేసుమెంటు ప్రయత్నాలన్నీ నిష్ఫలము లయినప్పటికిన్ని జర్మనీవారు అందువల్ల చెడిపొయ్యేదికానీ నష్టపడేదికానీ ఏమీ ఉండదనికూడా నిర్ణయించినారు.

జర్మను ప్రభుత్వానికిన్నీ, కేసుమెంటుకున్నూ ఒడంబడిక జరిగినది. ఐరిషుయోధులను యుద్ధములో ఖైదీలుగాఉన్న ఐరిషువాండ్లనందరినీ కేసుమెంటు వెంట పంపేయేర్పాటు. వాళ్లనందరిని ఒకపటాలముగా ఏర్పాటుచేసి ఐర్లాండుకు తీసుకొనిపోయి యింగ్లీషువాండ్లమీద తిరగబాటుచేయవలెనని ఆయనసంకల్పము. అందుకోసరము ఖైదీలనందరిని లింబర్గుపట్టణానికి జర్మనుప్రభుత్వము పంపించినది. జర్మను ప్రధాన మంత్రి "జర్మనుప్రభుత్వము ఐరిషుదేశము, ఐరిషు ప్రజలు, ఐరిషు ప్రజాసంస్థల శ్రేయస్సునే కోరుతున్నది. వారి జాతీయాభివృద్ధి, వారి దాస్యమోచనము కాంక్షిస్తున్నది." అని ఒకపెద్దప్రకటనముకూడా చేసినాడు.

కేసుమెంటు తలపెట్టినకార్యము అతనుఊహించినంత సులభమయినదికాదు. అక్కడ బందిఖానాలో ఉన్న ఐరిషుయోధులు రాజభక్తిపరాయణులు. మొట్టమొదట ఫ్రాంసుదేశానికి వాండ్ల బలపరాక్రమము చూపించడానికి బ్రిటీషుప్రభుత్వము ఏరిపంపిన ఐరిషుయోధులు వాండ్లు. తరతరాలనుంచి సేనలో కొలువు చేసినారు. తాత్కాలికోత్సాహముతో స్వాతంత్ర్యము కావలెనని చిందులుతొక్క కుర్రసజ్జుకాదది. వాండ్ల ముక్కూ ముఖమూ కలలోనైనా కేసుమెంటు ఎరగడు. జర్మనీలో అదివరలో బందిఖానాలో వాండ్లు అనుభవించిన ఘోరబాధలనైనా, పాపము, కేసుమెంటు ఎరగడు. ఉత్సాహము - ఉద్రేకములోఉన్న కేసుమెంటు వాండ్లను కలసుకొన్నాడు. మనోగతాభిప్రాయాలను వాండ్లకు వెల్లడించినాడు. ఇంగ్లీషువాండ్లు ఐరిషువాండ్లకు చేస్తున్నఅపచారాలను ఆజయిలులో ఉన్న వాండ్లకు ఉపన్యాసమిచ్చినాడు. "బ్రిటీషువాండ్ల మదము అణచడానికి బ్రిటీషుప్రభుత్వములోనుంచి ఐర్లాండు తొలగిపోవడానికి ఒకపటాలము ఏర్పాటు చేయవలెను. ఆపటాలానికి అవసరమయిన సహాయమంతా జర్మన్ ప్రభుత్వము చేస్తుంది. వాండ్లు జర్మను ప్రభుత్వసలహాలను అనుసరించి యింగ్లీషుసేనలతో పోరాడవలెను. ఈ విషయాలన్నీ అంగీకరించినవెంటనే వారు జర్మన్ ప్రభుత్వమువాండ్ల అతిథులుగా బయలు

దేరి వెళ్ళిపోవలెను" ఈ విధముగా ఉపన్యాసమివ్వడమే కాకుండా యింకావివరముగా విషయాలన్నీ తెలియజేస్తూ కరపత్రాలను అచ్చువేయించికూడా వాండ్లకు పంచిపెట్టినాడు. అయితే అక్కడఉన్న ఐరిషుఖైదీలంతా రాజభక్తిపరాయణులు. అటువంటి కష్టకాలములో బ్రిటీషుసామ్రాజ్యవినాశమనేది వాండ్లకు నచ్చలేదు. పైగా ఆనాటివరకూ ఖైదీలుగా అనుభవిస్తున్న బాధలన్నీ ఉపన్యాసముతో మరిచిపోలేదు. ఆ బందిఖానాలో ప్రాణాలు కోల్పోవడానికయినా వాండ్లు సంసిద్ధముగా ఉన్నారు. కాని కేసుమెంటు అభిప్రాయాలతో వాండ్లు ఏకీభవించలేకపోయినారు. పైపెచ్చు కేసుమెంటుమీద వాండ్లకు విపరీతమయిన కోపము వచ్చినది.

కేసుమెంటు ప్రయత్నాలు కొనసాగేటట్టు కనిపించకపోయినప్పటికిన్ని ఆయన ఉత్సాహము, ఆయన ఆశలు మాత్రము తగ్గలేదు. ఈలోపల జర్మన్ విదేశాంగ మంత్రితో ఆయన సంధిపత్రముకూడా వ్రాయించుకొన్నాడు. ఆసంధి పత్రములో ముఖ్యమయినవి మూడు షరతులున్నవి. ౧.ఐరిషు పటాలము కేవలము ఐరిషువారి కోసరమే యుద్ధము చేయవలెను. కాని ఏ సందర్భములోనూ జర్మనీ దేశప్రయోజనము కోసరముపనిచేయవలసిన అగత్యము లేదు. ౨.జర్మనీవారు నౌకాయుద్ధములోజయము పొందేట్లయితే జర్మన్ ప్రభుత్వమువారు జర్మన్ అధికారులను, సైనికులను, ఐరిషు పటాలాలకు సహాయము చేయడానికి ఐర్లాండుతీరముకు వస్తారు. ౩. ఒకవేళ జర్మనీవాండ్లు ఐరిషుదేశమువచ్చి సహాయముచేయడము సాధ్యము కాకపొయ్యేట్లయితే ఐరిషు పటాలాలు ఈజిప్టుదేశము జర్మనీవాండ్ల సహాయముతో వెళ్ళి, అక్కడ ఆ ఈజిప్టుదేశములో ఉన్న బ్రిటీషువాండ్లను ఆదేశమునుంచి వెళ్ళగొట్టవలెను. ఇటువంటి షరతులతో సంధిపత్రము వ్రాయించుకొని కేసుమెంటు రెండవ పర్యాయము ఖైదీలను ప్రోత్సాహము చేయడానికి వచ్చినాడు.

మొట్టమొదటిసారి బందీలను చూసినప్పుడు వాండ్లు అనంగీకారాన్ని మాత్రమే కనబరచినారు. ఈ పర్యాయము కేవలము ఆయన్ను కొట్టడానికి ఒకరిద్దరు తయారుఅయినారు. అయితే జర్మను అధికారులు వెంట ఉన్నందువల్ల అట్లా జరిగిందికాదు. లేకపోయినట్లయితే ఐరిషుదేశవువాండ్ల చేతులలోనే ఆయనకు దేహశుద్ధి అయిఉండేది. ఆయన ప్రయత్నాలు సాగుతవనే ఆశ ఏ మాత్రమూ కనుపించక పోయినప్పటికిన్నీ ఆయన ఉత్సాహము మాత్రము తగ్గలేదు. హతాశుడయినకొద్దీ పట్టుదల హెచ్చిపోయింది. కొంతకాలము గతించిన తర్వాత ఐరిషుఖైదీలను హెచ్చరిస్తే తప్పకుండా ఉన్ముఖులు అవుతారని ఆయన విశ్వాసము. చివరకు పాపము ఆయన జర్మనీవాండ్ల దృష్టిలోనే వింత మనిషిగా తోచినాడు. పిచ్చివాడేమోనని కూడా అనుకొన్నారు. జర్మన్ పోలీసువాండ్లు ఆయన యోగ్యతను గురించి కూడా అనుమానించ సాగినారు. అదిఅంతా ఆయనకు తెలుసును. అందుకోసరమని ఆయన లింబర్గుపట్టణము వదలిపెట్టి మ్యూనిచ్ పట్టణములో కొన్నాళ్లు తలదాచుకొనడనికి వెళ్లినాడు.

కొంతకాల మయినతర్వాత తిరిగి లింబర్గుపట్టణానికి వచ్చినాడు. మూడవసారి ఐరిషు ఖైదీలను చూడడానికివెళ్ళినాడు. మళ్లీ వాండ్లను తన ప్రయత్నముకోసరము ప్రోత్సాహపరిచినాడు. ఒకరిద్దరు ఆయన్ను అనుసరించడానికి మొట్టమొదట ఒప్పుకొన్నారు. చచ్చిచెడి ఎట్లాగైతేనేమి యాభైమంది ఆయన ఉద్యమములో చేరడానికి సంసిద్ధులయినారు. అయితే జర్మనీలో ఆనాటికి రెండువేల అయిదువందలమంది ఐరిషు ఖయిదీలున్నారు. అంతమందిని తన ఉద్యమములోకి లాగవలెనని ఎంతో తీవ్రమయిన ప్రయత్నము చేసినారు. ఎంతెంతమందో ఆ పనికి పూనుకొన్నారు. కాని లాభములేకపోయినది. ఆ ఐరిషు ఖయిదీలంతా పనేమిరా అన్నారు. చివరకు హతాశుడయిపోయినాడు. ఉత్సాహము పోయింది. అటూయిటూ తారట్లాడడము మొదలు పెట్టినాడు. కాని ఆయాభైమందితోనే తన ఉద్యమము సాగించవచ్చుననుకొన్నాడు. ఈయనకన్నబై వైరివాండ్లు జర్మనీవాండ్లు. జర్మను మిలిటరి వాండ్లు ఆయాభైమందికే కవాతు నేర్పడము ప్రారం

భించినారు. అయితే అంతా హాస్యాస్పదముగా ఉందని వారికి తెలియకపోలేదు. పిచ్చిఆశ ఎటువంటి పనులయినా, ఎటువంటి బుద్ధిమంతులచేతనైనా చేయిస్తుంది. అయితే ఆకాస్త పటాలముతో ఐర్లాండువెళ్లి లాభము లేదనుకొని జర్మనీవారి కోరికమీద వాండ్లను సిరియా దేశము కేసుమెంటు పంపించినాడు.

దైవమాయ ఎవరికీ తెలియదు. ఎందుకు ఎప్పుడు ఏమి జరుగుతుందో ఫలపరిపాకము అయిననాడే తెలుస్తుంది.

ముందుగా ఊహించడానికి శక్యముకాదు. ఈ విధముగా జర్మనీలో కేసుమెంటు ప్రయత్నాలుచేస్తూ ఉండగా, అంటే ౧౯౧౬ వ సంవత్సరములో ఈస్టరు పండగలలో అటు ఐర్లాండు దేశములో పెద్ద కల్లోలము పుట్టినది. అల్లరిమూక ప్రభుత్వాన్ని ఎదిరించినది. బజారులలోనే తుపాకులతో కాల్చుకొనడము ప్రారంభమయినది. ఈ వర్తమానాలు జర్మనీలో తెలిసినవి. కేసుమెంటుకు ఇక నవకాశము దొరికింది. పిచ్చి ఉత్సాహము వచ్చింది. ఇక ఐర్లాండు దేశానికి అదనుకు అవసరమయిన మందుగుండుసామగ్రితో వెళ్లిపోతే బ్రిటీషు సామ్రాజ్యాన్ని తల్లకిందులు చేయవచ్చుననుకొన్నాడు. ఆపాళంగా ఐర్లాండుకు బయలుదేరినాడు.

౨

ఐర్లాండుదేశములో కెర్రి సముద్రతీరాన, ట్రాలీ అనే ప్రదేశములో పల్లెవాండ్లు నివసిస్తూ ఉండేవాండ్లు. అది అట్టే నివాసయోగ్యమయిన ప్రదేశమయినా కాదు. ఆ కుగ్రామములో ఉన్నవాండ్లలో జాన్ మెకార్తె అనేవాడు ౧౯౧౬ సంవత్సరము ఏప్రిల్ మాసములో వచ్చే "గుడ్ ఫ్రైడే" నాడు తెల్లవారు ఝామున రెండు గంటలప్పుడు దైవ ప్రార్థన చేసుకోవడానికి ఒకానొక నూతి దగ్గరకు వెళ్లినాడు. వాడు ప్రార్థనఅయిపోయి యింటికి తిరిగి వస్తూ ఉండగా సముద్రపు ఒడ్డున ఒక చిన్ననావ కనబడింది. అప్పుడు పాటు అయినందువల్ల ఆనావ సముద్రములోకి కొట్టుకొనిపొయ్యేటట్టు తోచింది. అందుకోసరము దాన్ని ఒడ్డుకు తోయవలెననేఉద్దేశముతో నావదగ్గిరకు వెళ్లినాడు. ఆనావ చాలా బరువుగా ఉన్నందువల్ల వాడికొక్కడికి సాధ్యముకాలేదు. సాయముపట్టడానికి వాడిస్నేహితుడి కొకడికి రమ్మని తన కుర్రవాడిచేత వర్తమనము కూడా చేసినాడు. అ ఉభయులూ కలసి సాధ్యమైనంత వరకు బయటకు లాగినారు. ఆ నావలో ఒక బాకు వాండ్లకు కనుపించినది. ఆనావలోనుంచి మనుష్యులు దిగివెళ్లినట్టు అడుగుల గుర్తునుబట్టి ఊహించినారు. జాగ్రత్తగా పరిక్షచేసేసరికి ఆ నావలోనుంచి ముగ్గురు మనుష్యులు దిగి ఉంటారని తోచింది. ఆముగ్గురూ ఎవరో, ఎక్కడకు పోయినారో తెలుసుకోవలెనని అడుగుల జాడను బట్టి బయలుదేరినారు. పాతికిముప్ఫయి గజాల దూరము పోయేసరికి అడుగులజాడ కనుపించలేదు. తిరిగీ రేవు దగ్గిరకు వచ్చేసరికి 'మెకార్తె' కుర్రది - ఏనిమిదేండ్లపిల్ల అపడవలో కూర్చుని ఆ పడవలోఉన్న రివాల్వర్లతో ఆడుకొంటున్నది.

వాళ్లకేమీ తోచక సమీపములో "ఆర్డుఫర్టు" అనేగ్రామములో ఉన్న పోలీసుస్టేషనుకు కబురుచేసినారు. ఆపోలీసుస్టేషన్ చాలాచిన్నది. ముగ్గురు పోలీసు బంట్రోతులు - ఒకసార్జెంటు యీవర్తమానము వచ్చినవెంటనే - ఒక్క క్షణమయినా జాగు చేయకుండా ఆపడవదగ్గిరకు వెళ్లిపోయినారు. ఆ నావనంతా సోదా చూసినారు. రివాల్వర్లు, తుపాకులు మొదలయిన యుద్ధసామగ్రిఉన్నది. తిరిగి వాండ్లు పోలీసుస్టేషనుకు వచ్చి అవసరమయిన సిబ్బంది తీసుకొని ఆచోకీ తీయడానికి బయలుదేరినారు.

ఆ ప్రాంతాలలో ఒక పాడుబడ్డ కోట ఉన్నది. ఆక్కడవాండ్లు ఎవరయినా దాగుకొని ఉండవచ్చుననుకొని పోయినారు. నల్లటిగడ్డము, ముసలివాడు కేసుమెంటు కనుపించినాడు. సార్జెంటు ఏవేవో ప్రశ్నలు ఆయన్ను అడిగేసరికి "నీవెవడవు నన్ను అడగడానికి" అని జవాబు యివ్వలేదు. ఆయన్ను ఖయిదుచేసినారు. ఆనాడు ఉదయము కేసుమెంటును ఖయిదీచేయడానికి ఒక్క

మెకా ర్తె వ ర్తమానమే కాదు. ఆరాత్రి సముద్రములో 'బ్లూబెల్' అనేయుద్ధనౌక ఇంగ్లీషుది సముద్రములో జరుగుచున్న విషయాలు కనిపెట్టేనిమిత్తము తిరుగు తున్నది. అర్ధరాత్రి దూరాన ఒక ఓడ వెళ్లుచున్న బ్లూబెల్ కు కనుపించినది. వాండ్లకు సందేహము కలిగి విచారించినారు. అది నార్వే దేశపుదనిన్నీ, జెనివా వెళ్లు తున్నట్టున్నూ తెలిసినది. "బ్లూబెల్" వాండ్లు ఆవిష యాన్ని నమ్మక ఆఓడను తమవెంట హార్బరులోకి రమ్మని ఆజ్ఞాపించినారు. 'బ్లూబెల్' తమవెంట ఆఓడ వస్తుందని హార్బరుకు బయలుదేరినది. అయితే ఆనార్వే ఓడ వెంటవస్తూవస్తూ ఆగిపోయినది. కదలకుండా మెద లకుండా ఉండిపోయినది. ఆఓడమీద ఆఓడలోనుంచి ఒకటిరెండు చిన్న నావలను సముద్రములోకి జారవిడు స్తున్నట్టు 'బ్లూబెల్' వాండ్లు తెలుసుకొన్నారు. వెంటనే ఆఓడమీదికి తుపాకిబారుచేసి కాల్చేసరికి బయలుదేరింది. చివరకు తెల్లవారుఝామువరకు ఆ ఓడను వేటాడి పట్టుకొన్నారు. అందులో కొంతమంది జర్మనుదుస్తులతో ఉన్న సైనికులను పట్టుకొన్నారు. వాండ్లను యుద్ధఖయిదీలకింద తీసుకొన్నారు. ఆఓడ ఆగినచోట జలాంతర్గాములువెళ్లి సముద్రము అడుగు భాగాన వెతికినవి. అక్కడ ఒకనావలో విశేషముగా యుద్ధసామగ్రులు దొరికినవి. మరొకనావ ఏమయినదో తెలియక విచారించగా క్రీరతీరానికి వెళ్లినట్టు తెలి సింది. ఈవర్తమానముకూడా పోలీసువాండ్లకు వచ్చినది.

ఈ విధముగా దైవమాయవల్ల ఐరిషువిప్లవకారు లకు జర్మనుదేశమునుంచి వచ్చిన యుద్ధసామగ్రులు అందకుండాపోయినవి. నిజముగా ఐరిషువిప్లవము ఆరంభ మయ్యేసమయానికే కేసుమెంటు తెచ్చిన ఆయుధా లన్నీ అందిఉండినట్లయితే బ్రిటిషుప్రభుత్వానికి చాలా ఆపద వచ్చిఉండేదని చెప్పడానికి ఏ అభ్యంతరమూ లేదు. భగవదిచ్ఛ లేనంతవరకు మనుష్యప్రయత్నాలన్నీ యీ విధముగా నెరవేరుతవి.

కేసుమెంటును ఖయిదీచేసి లండనుపట్టణానికి పోతున్న సమయములో యిద్దరుఐరిషుయువకులనుపోలీసు వాండ్లు పట్టుకొని వస్తూఉన్నట్టూ, వాండ్లు మార్గమధ్య ములో మోటారులోనుంచి ఒకచెరువులోకి దూకినట్లూ వర్తమానముతెలిసింది. కేసుమెంటుకు యీ విషయము తెలియగానే కండ్లవెంట బొటబొట నీళ్లుకారినవి. ఆయన విపరీతమయిన దుఃఖముతో "అయ్యోవాండ్లు అమాయకులు - యోగ్యులు - చిన్నవాండ్లు. వాండ్లను నేను ఎరుగుదును. వాండ్లు నానుంచి అట్లా ఆయిపోయి నాగు. ఆనీళ్లలోతు నాకు తెలుసును" అన్నాడు.

కేసుమెంటు అదివరకు ఎన్నిరోజులనుంచో సరిగా నిద్రపోయిఎరగడు. తన్ను లండన్ కారాగృహానికి తీసుకొనివెళ్లుచున్న సంగతి తెలుసును. కారాగృహాలు ఎట్లాఉంటవో ఏమో ఆయన కలలోనైనా ఎరగడు. చాలా డస్సిపోయిఉన్నాడు. వెంటఉన్న పోలీసుభటు లతో "రాత్రి అక్కడ పడుకొనడానికి పక్కఏమ యినా దొరుకుతుందా" అనిఅడిగినాడు. పాపము ఆ నాటికి అతను కండ్లుమూసి పన్నెండురోజు లయినట్టు వాండ్లతో చెప్పినాడు. ఆయన్ను లండన్ కారాగృహానికి- అదివరలో ఎంతమందో రాజద్రోహులు - హంతకులు పవ్వళించిన ఆ కారాగృహానికి - తీసుకొనివెళ్లినారు.

౧౯౧౬ సంవత్సరము మేనెల ౧౫, ౧౬, ౧౭ తేదీలలో కేసుమెంటుమీద రాజద్రోహనేరముమోపి విచారణకు హైకోర్టువారికి పంపించినారు ఆకాలములో రీడింగుప్రభువు - మనకు రాజప్రతినిధిగా పనిచేసినవాడు_ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నాడు. ఆయనతోపాటు యింకా యిద్దరున్యాయమూర్తులు యీ రాజద్రోహ నేరాన్ని విచారించినారు. ఉభయపక్షములా ప్రసిద్ధులు, సమర్థులు అయిన న్యాయవాదులు వాదప్రతివాదము చేసినారు. ౧౩౬౫ వ నిబంధనకింద కేసుమెంటుమీద రాజద్రోహనేరము మోపినారు.

విచారణ ఆరంభము అయినది కేసుమెంటు తరఫున వాదించడానికి సార్జెంటుసల్లివాన్ అనే జగద్వి ఖ్యాతమయిన న్యాయవాది వచ్చినాడు. ఆయన కోర్టువారు నిర్ణయించిన ప్రకారము కేసుమెంటుమీద రాజద్రోహము నేరము ఆపాదించడానికి వీలులే

దన్నాడు. రాజద్రోహ చట్టము ౧౩౫౧ నిబంధనలో "మన ప్రభువయిన రాజుగారిమీద ఎవడయినా యుద్ధముచేయడానికి (ఆయన) రాజ్యములో సైనికులను సిద్ధముచేసినా-కాక రాజుగారిశత్రువులతో రాజ్యములో ఏకమయి వాండ్లకు రాజ్యములో కానీ అన్యత్రా కానీ సహాయము, ప్రోత్సాహము చేసినట్లయితే" అని ఉంది. (If a man do any war against our lord the king in his realm, or be adherent to the king's enemies in his realm giving them aid and comfort in his realm or elsewhere") ఇందువల్ల కేసుమెంటు చేసిన నేరము ఈ నిబంధన కిందకురాదు. ఈనిబంధనకు యీనాడు తజాగా అర్థము ఆలోచించవలసినదే తప్ప ఏవో నేరాలన్నీ తీసుకొని వచ్చి ఉదాహరణలుగా చూపించడానికి వీలులేద న్నాడు. రీడింగు ప్రభువు ఆవాక్యానికి అర్థ కల్పనము చేసినాడు. ఆపంక్తిలో ఉన్న అన్యత్ర (elsewhere) అనే శబ్దము ఉభయత్ర అన్వయము చేసుకోవలెనని ఆవాదాన్ని తోసి పారవేసినాడు.

మూడు రోజులు చాలా శ్రద్ధతో, జాగ్రత్తగా నేరము విచారించినారు. ప్రాసిక్యూషన్ సాక్షులను సల్లివాన్ ఎదిరించలేదు. ఆసాక్షులు చెప్పిన విషయములో అసత్యము ఉంటేకదా ఎదిరించడానికి సాధ్యమయ్యేది. కాని చివరకు నేరము విషయము కోర్టువారికివిన్నవిస్తూ అత్యంతధైర్య సాహసములతో సార్జెంటు సల్లివాన్ "సర్ రోజరుకేసుమెంటు ఇంగ్లీషుకాలువులో లేడు, సంయుక్త ప్రభుత్వములో ఉద్యోగము చేసినాడు............ఐర్లాండు దేశము వేరు- ఐరిషుప్రజలు వేరు. ఐరిషువాడికి ఐరిషుదేశభక్తి ఉంటుంది. ఒక దేశముమీద దేశభక్తి తోటిదేశానికి రాజ ద్రోహము అయి, అందుకు- ఆదేశభక్తికోసరము శిక్షించిన దినము సామ్రాజ్యానికి దుర్దినము. ఐర్లాండు దేశానికి యింగ్లీషు న్యాయము (authority) అన్వర్తించదు............ ఐరిషువాండ్లు యింగ్లీషువాండ్లకంటె తక్కువ వాండ్లు కానీ, బానిసలు కానీ కారు." అనిచెప్పినాడు.

రాజద్రోహ నేరము స్థిరపడిపోయినది. న్యాయమూర్తులు ఉరిశిక్ష విధించినారు. అయితే రీడింగు ప్రభువు నిందితుడు చెప్పుకోతగిన విషయాలకు అవకాశమిచ్చినాడు. అందుకు కేసుమెంటు తయారుచేసుకొన్న ఉపన్యాసము కోర్టులో చదివినాడు. తన్ను విచారించడానికి యింగ్లీషుకోర్టుకు హక్కు లేదనీ, తనమీద నేరము మోపడానికి తీసుకొన్న చట్టము చాలా పాతదనీ, ఆనాడు ఆచట్టము ప్రకారము నేరారోపణచేయడము చాలాఅధర్మమనీ చెప్పినాడు. కేసుమెంటు ఉపన్యాసములు ఎన్నడూ చేసినెరగడు. తడబడుతూ, అర్థము కాకుండా ఉపన్యాసాన్ని చదివినాడు. అయితే మధ్యలో "స్వరాజ్యము మా జన్మహక్కు. అది మాకు ఉగ్గుపాలతో పెట్టినది. అది ఒకరుముష్టిపెట్టేది కాదు. దాన్ని మరొకళ్లు అభ్యంతర పెట్టడమనేది ప్రాణాలు తీసివేయడమే..."అని చదివేటప్పుడు మాత్రము ఎంతో గంభీరముగా గొంతుఎత్తి చదివినాడు. కోర్టులో యిటువంటి ఉపన్యాసాలు రాజ ద్రోహ నేరముకుగాను చదవడమువల్ల ప్రయోజనము ఏమిఉంటుంది? అయితే ఆ ఉద్రేకము అట్లాచేయిస్తుంది.

౧౯౧౬ సంవత్సరము జూన్ నెల ౨౯ వ తేదిన కేసుమెంటు "చచ్చిపొయ్యేవరకు గొంతుకు ఉరిపోయవలసినది" అని కోర్టువారు తీర్పుచెప్పినారు. ఈతీర్పును అతినిర్లక్ష్యముగా విన్నాడు. ఆయనముఖాన చిరునవ్వు చిందులాడింది.

తర్వాత అప్పీలులోకూడా చాలాశ్రద్ధతో విషయాలన్నీ పరిశీలించినారు. కాని లాభము లేకపోయినది. ఆగష్టు నెల 3 వ తేదిన "పెన్టన్విల్లి" కారాగృహములో ఉదయము ఎనిమిదిగంట లప్పుడు సర్ రోజరు కేసుమెంటును ఉరితీసినారు.

ప్రభుత్వము ఆయన నేరాన్ని మన్నించవలసినదని అనేకమంది ప్రముఖులు దస్కతులుచేసి మహజర్లు పెట్టుకొన్నారు. ఆయన్ను క్షమించమనడానికి రెండే కారణాలు ఆమహజర్లలో కనుపించినవి. కొద్దిరోజుల క్రిందటనే ఐర్లాండులో తిరుగుబాటువచ్చినది. ఆతిరుగుబాటుకల్లోలము యింకా పూర్తిగా సమసిపోలేదు. అందువల్ల యీ కేసుమెంటును ఉరితీస్తే ఐరిషువారికి ఇంగ్లీషువారి సుహృద్భావముమీద అపనమ్మకము కలు

గుతుంది. అందువల్ల ఐరిషువారికి యింగ్లీషువారిమీద క్రోధము ఎక్కువయిపోతుందని కొంతమందిఅన్నారు. కేసుమెంటు దేశదేశాలుతిరిగి ఎంతోపనిచేసి ఆరోగ్యము చెడిపోయి మతిపోయి అట్లాచేసినాడు. చాలా మంచి వాడు. కాబట్టి క్షమించవలసినదని యింకొక్కళ్ల అభిప్రాయము.

ఈరెండు వాదాలున్నూ చాలా దుర్బలములయినవే. ఐరిషుదేశములో వచ్చిన తిరగబాటుకున్నూ కేసుమెంటుకున్నూ ఏమి సంబంధమున్నది? ఐరిషువాండ్లు యింట్లో అన్నదమ్ముల వ్యవహారముగా పోట్లాటకు తయారుఅయినారు. కేసుమెంటు రాజును, రాజ్యాన్ని, సమస్తాన్ని ధ్వంసముచేయడానికోసరము - అందులో ప్రభుత్వము కష్టకాలములోఉన్నప్పుడు శత్రురాజబలముతో సిద్ధముఅయినాడు. ఇక రెండోకారణము కేవలము అర్థములేనిది. మతిపోయినవాడు చేసేపనులా సర్ రోజర్ కేసుమెంటు చేసినవి!

---



సముద్రతీర ప్రాంతము                                                                 K. M. R.